సాక్షి
బాపట్ల
గురువారం । 13 । జూలై । 2023



స్టేడియం అభివృద్ధికి కృషి

మంగళగిరి: ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రా క్రికెట్ సంఘ సెక్రటరీ గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ. రవీంద్రబాబు కుటుంబ సమేతంగా బుధవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



రేపు శాకంబరీదేవిగా భ్రమరాంబ

పెదకాకాని: భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించనున్నట్టు ఆలయ ఏసీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

14న మినీ జాబ్ మేళా

నరసరావుపేట: కలెక్టరేట్‌లో ఈనెల 14న నవోదయంలో భాగంగా మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ కె.సంజీవరావు బుధవారం వెల్లడించారు. మేళాలో రెండు కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జీతం అర్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.16వేల వరకు ఉంటుందని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, ఫార్మసీ, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని వివరించారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల్లోగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు వీరాంజనేయులు, 91602 00652 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం



నరసరావుపేట రూరల్: భువనచంద్ర టౌన్ హాలులో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 281 మంది విభిన్న ప్రతిభావంతులు శిబిరంలో పాల్గొన్నారు. వీరికి సిబ్బంది పరీక్షలు, కొలతలు నిర్వహించి 210 మందికి ఉపకరణాలు అవసరమని గుర్తించారు. అర్హులైన వారికి చేతి కర్రలు, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, రోటో టెర్స్, ఎంఎస్ఐఈడీ కిట్, స్మార్ట్ కేన్, అంధుల చేతి కర్ర, కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాల పంపిణీకి సిఫార్సు చేశారు. శిబిరంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 47,122 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 47,122 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,937 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.11,500 నుంచి 22,400 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 10,000 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,010 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పాఠశాలలకు నేరుగా సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు అమెజాన్ ద్వారా సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఈనెల 20వ తేదీలోపు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెజాన్ ద్వారా సరఫరా కాని పాఠశాలలకు సంబంధిత ఎంఈవోలు తహసీల్దార్‌ల నుంచి ఎండీయూ వాహనాలను పొంది, వాటి ద్వారా పుస్తకాలను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ఈనెల 22న సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయాలని స్పష్టం చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 3,259, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 4,609 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

నమఃసేవాయ

మానవ సేవే.. దేవుని సేవ. మతమేదైనా బోధించే సూత్రమిదే.. అందుకే జన సేవకు ఓ సైన్యాన్నే తయారు చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన ఆశయాలకు అనుగుణంగా దిగ్విజయంగా పనిచేస్తున్న వలంటీర్లు ప్రజల తలలో నాలుకలా మెలుగుతున్నారు. ప్రశంసలతోపాటు ఆశీస్సులూ అందుకుంటున్నారు. సేవే నిత్యం.. ఇదే సత్యం.. నినాదంతో ముందుకు సాగుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మానవ సేవలోనే దైవత్వం

- ఇదే వలంటీర్ల వ్యవస్థకు స్ఫూర్తి
- కరోనా వేళ అసమాన పనితీరు
- గళమెత్తి ప్రశంసిస్తున్న ప్రజలు

నెలనెలా ఒకటో తారీఖు వేకువనే తలుపుతట్టి కళ్లలో కాంతులు కురి'పించెను' కన్నబిడ్డలా.. అనారోగ్య మొస్తే అండగా నిలిచేను ఆపద్బాంధవునిలా.. సంక్షేమాన్ని ముంగిళ్లలోకే తీసుకొచ్చేను మేలుకోరే నేస్తంలా.. ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ ధైర్యమిచ్చేను జగనన్న బంటులా.. అదే వలంటీరులా.. కరోనా కష్టకాలంలో వారి సేవలు అనన్యసామాన్యం.. అనితర సాధ్యం.. ఇలాంటి వ్యవస్థపై అవాకులు, చెవాకులు పేలుతున్న కొందరికి సంక్షేమ సైన్యం అందించిన ఈ అసమాన సేవలే దీటైన సమాధానాలు. నిలువెత్తు సేవకు సజీవ సాక్ష్యాలు.

కూతురిలా.. కంటికి రెప్పలా..



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు పీటా వెంకటేశ్వరరావు. ఊరు బాపట్ల జిల్లా అంజూర నందిరాజుతోట. షుగర్ ఎక్కువ కావడంతో ఈయన ఎడమ కాలును వైద్యులు తీసేశారు. గుంటూరు సెయింట్ జోసెఫ్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్నారు. ఆ సమయంలో దాదాపు తొమ్మిది నెలలు గ్రామ వలంటీర్ దుర్గాంబిక ఆసరాగా నిలిచింది. నిత్యం యోగక్షేమాలు తెలుసుకుంది. క్రమం తప్పకుండా నెలనెలా ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ అందించింది. ఇంటికి వచ్చిన తర్వాత కూడా కూతురిలా కంటికి రెప్పలా చూసుకుంది. ఆమె రుణం తీర్చుకోలేనని వెంకటేశ్వరరావు చెమర్చిన కనులతో చెబుతున్నారు.

– బాపట్ల అర్బన్

200 కిలోమీటర్లు వెళ్లి..

నకరికల్లుకు చెందిన దరియా హుస్సేన్. గతేడాది మేలో మత ప్రార్థనల కోసం నెల్లూరు వెళ్లారు. ఆ సమయంలో పెన్షన్ ఇచ్చేందుకు వలంటీర్ షేక్ మస్తాన్‌వలి 200 కిలోమీటర్ల దూరం వెళ్లి దరియా హుస్సేన్‌కు పెన్షన్ అందించాడు. ప్రయాణ ఖర్చులకు హుస్సేన్ డబ్బులిస్తానన్నా తీసుకోలేదు. ఇది నిస్వార్థ సేవకు నిదర్శనమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి అని దరియాహుస్సేన్ ఆనందంగా చెబుతుంటారు.

– నకరికల్లు

ఒంటరికి తోడూనీడ



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గుర్రపుసాల సాంబయ్య. వయస్సు 65. ఆయనకంటూ ఎవరూ లేరు. ఒంటరి. ఊరు మాదల. వలంటీరు కమ్మెలనాగేశ్వరరావు ఆయనకు పింఛన్ వచ్చేలా చేశాడు. సాంబయ్య కబురు చేసిన వెంటనే వెళ్లి బాగోగులు చూస్తున్నాడు. తోడునీడగా నిలుస్తున్నాడు.

– ముప్పాళ్ల



పొన్నూరు మండలం మామిళ్ళపల్లిలో శుక్రవారం వలంటీర్లను బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ సత్కరించారు. వారి సేవలను అభినందించారు.

వలంటీర్లకు వందనం

కని'పించెను' కిరణమై



ఈఫోటోలోని వృద్ధుడి పేరు జిఱ్రిపోతు మనోహరం. క్రోసూరు మండలం ఊటుకూరు స్వగ్రామం. ఏడాది కిందట పక్షవాతం వచ్చింది. కదల్లేని స్థితిలో ఉన్నారు. వైద్యం కోసం పెదకాకానిలోని కుమార్తె వద్ద ఉంటున్నారు. ఈనెల పెన్షన్ తీసుకునేందుకు రాలేని స్థితిలో ఉండడంతో గ్రామ వలంటీర్ జి.రవికిరణ్ సొంత ఖర్చులు పెట్టుకుని పెదకాకాని వెళ్లి పింఛన్ అందించాడు. వలంటీర్ సేవాతత్పరతను మరిచిపోలేనని మనోహరం ఆనందం వ్యక్తం చేశారు.

– ఊటుకూరు(క్రోసూరు)

కరోనా వేళ కరుణా హృదయం

ఫిరంగిపురం: గ్రామంలోని కొత్తపేట 14వ వార్డు వలంటీర్ ఎం.అనిల్‌తేజ, రసూల్‌పేట వలంటీర్ పవన్, 7వ వార్డు వలంటీర్ ఆర్.జోసఫ్, క్రీస్తునగర్ వలంటీర్లు నవీన్, అశోక్, సాగర్‌రెడ్డి కరోనా వేళ కరుణా హృదయం చాటారు. కోవిడ్‌తో మరణించిన వారి అంత్యక్రియలు స్వయంగా రక్షణ దుస్తులు ధరించి చేపట్టారు. కోవిడ్ మృతుల ఇళ్లల్లో ఉచితంగా ఫాగింగ్ నిర్వహించారు. కరోనా రోగులను ఆస్పత్రిలో చేర్పించడం దగ్గర నుంచి వారు తిరిగి వచ్చే వరకూ పర్యవేక్షించారు. క్వారంటైన్‌లో ఉన్న వారికి ఉచితంగా మందులు, పోషకాహారం అందించి అందరి ప్రశంసలు అందుకున్నారు.



కరోనాతో మృతిచెందిన వ్యక్తిని అంతిమ సంస్కారాలకు తీసుకెళ్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్ల సేవ భేష్



కరోనా సమయంలో సొంత బంధువులే దగ్గరకు రాని పరిస్థితి. ఆ సమయంలో వలంటీర్లు లేకపోతే ఎలా ఉండేదో తలచుకుంటేనే భయమేస్తోంది. మా బంధువు చనిపోవడంతో స్థానిక వలంటీర్ రామిశెట్టి జోసఫ్ తన స్నేహితులైన వలంటీర్లతో కలిసి వచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు. మేము వలంటీర్లకు రుణపడి ఉంటాం. వారి సేవలు భేష్.

– గోపిరెడ్డి బాలరజిత, ఫిరంగిపురం

బిడ్డలా అండగా..



ఈమె పేరు జక్కిరెడ్డి ఆదిలక్ష్మి. భర్త చనిపోయి 20 ఏళ్లు. ఒక కొడుకు. భర్త చనిపోయినప్పటి నుంచి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. సీఎం జగన్ వచ్చాక వలంటీర్ మేకల చిరంజీవి ఆమె వద్దకు వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. వెంటనే మంజూరైంది. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ అందుతోంది. వలంటీర్ నిత్యం వచ్చి బాగోగులు చూస్తున్నాడు. కరోనా సమయంలో సరుకులు కావాలంటే ఇంటికే తెచ్చి ఇచ్చాడు. బిడ్డలా చూసుకున్నాడు. అతనికి ధన్యవాదాలు అని ఆదిలక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది.

– ముప్పాళ్ల

సంస్కారం చాటిన మానవత్వం



కరోనా సమయంలో నరసరావుపేట 14వ వార్డు కంభంపాలెం సమీపంలోని శారదాంబ థియేటర్‌కు ఎదురుగా ఓవర్ బ్రిడ్జి కింద లారీ క్లీనర్ మోహన్ మరణించాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. అయితే అంతిమసంస్కారాలు చేసే స్తోమత లేదని ఆమె చెప్పడంతో వలంటీర్ విజయ్‌కుమార్ మానవత్వం చాటారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతల సాయంతో తన సొంత నిధులు రూ.ఐదువేలు ఖర్చు చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

– నరసరావుపేట

నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం



వలంటీర్లు సేవలు నిస్వార్థమైనవి. కులమతాలకతీతంగా పక్షపాతం లేకుండా పనిచేస్తున్నారు. వారిని అభినందించకున్నా పర్వాలేదు చులకనగా మాట్లాడటం సరికాదు. ఈ రోజు ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతున్నాయంటే అందుకు కారణం ఒక్క వలంటీర్ల వ్యవస్థే. లేదంటే పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

– షేక్ జాని (ప్రత్తిపాడు)

ఆక్రమణల 'అల'జడి

తీరానికి పెను ముప్పు

- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- కరిగిపోతున్న కరకట్టలు
- పట్టించుకోని రెవెన్యూ, అటవీ అధికారులు
- సూర్యలంక బీచ్‌లో ఇదీ దుస్థితి



తనివి'తీరం'గా ఆక్రమణ : పుట్టగొడుగుల్లా వెలిసిన రిసార్ట్‌లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సూర్యలంక తీరంలో యథేచ్ఛగా సాగుతున్న ఆక్రమణల పర్వం అలజడి రేపుతోంది. పెను ముప్పు పొంచి ఉందనే సంకేతాలిస్తోంది. ఇదే విషయాన్ని పర్యాటక శాఖకు చెందిన ఓ అధికారి స్వయంగా వెల్లడించడం పొంచి ఉన్న ప్రమాదతీవ్రతను సూచిస్తోంది. తాజాగా బుధవారం జరిగిన గుడిసెల తొలగింపు వ్యవహారం సూర్యలంకలో ఆక్రమణల తీరును మరోమారు వేలెత్తి చూపింది.

మత్స్యకారులకు ఇచ్చిన స్థలాల్లో రిసార్ట్‌లు

సూర్యలంక తీరప్రాంతం మొత్తం ప్రభుత్వ స్థలాలే. తీరంనుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర అటవీశాఖ భూములే ఉన్నాయి. ఈ పరిస్థితిలో ప్రైవేటు వ్యక్తులు తీరంలో చొరబడే అవకాశం లేదు. గతంలో ప్రభుత్వం కొందరు మత్స్యకారులకు ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున ఇంటిపట్టాలను ఇచ్చింది. వారు అక్కడే నివాసం ఉంటే చేపలవేటకు అనుకూలంగా ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇదే అవకాశంగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు మత్స్యకారులకు నామమాత్రం డబ్బులు ఎరవేసి వారి స్థలాలు ఆక్రమించగా, ఇంకొందరు మత్స్యకారులను బెదిరించి మిగిలిన స్థలాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇసుక తిన్నెలు కనుమరుగు

మత్స్యకారుల నుంచి స్వాధీనం చేసుకున్న స్థలాల్లో రియల్టర్లు రిసార్ట్‌లు, హోటళ్లు ఏర్పాటు చేసి వ్యాపారం మొదలు పెట్టారు. అంతటితో ఊరుకోక రిసార్ట్‌ల నిర్మాణ సమయంలోనే వాటి పునాదులు పూడ్చేందుకు తీరంలోని ఇసుకనే తరలించారు. రాత్రుళ్లు జేసీబీలు పెట్టి సూర్యలంక తీరంలోని ఇసుకతోపాటు పక్కనే ఉన్న అటవీశాఖ స్థలం నుంచి ఇసుకను తరలించారు. బాపట్లతోపాటు ఇతర ప్రాంతాల్లోని కట్టడాల పునాదులు పూడ్చేందుకు తీరం ఇసుకనే తరలిస్తున్నారు. ఒక్కో టిప్పరు ఇసుకను రూ.15 వేలకు తక్కువ లేకుండా అమ్ముకొని పెద్ద మొత్తంలో దండుకుంటున్నారు. అటు అక్రమ రిసార్ట్‌ల వ్యాపారం ఇటు ఇసుక అక్రమ తరలింపుతో కొందరు భారీగానే వెనకేసుకుంటున్నారు. ఫలితంగా చూస్తుండగానే సూర్యలంక తీరంలోని ఇసుక దిబ్బలు కరిగిపోయాయి.

పొంచిఉన్న ప్రమాదం

చీరాల, ఇతర బీచ్‌లతో పోలిస్తే సూర్యలంక తీరం పెద్దపెద్ద ఇసుక తిన్నెలతో ఉంటుంది. ఈ ప్రాంతంలో సముద్రం లోతుగా కూడా ఉంటుంది. అలలు ఎగిసిపడినా సముద్రం ముందుకు వచ్చే పరిస్థితి ఉండదు. సునామీ సంభవించినప్పుడూ ఇతర ప్రాంతాల బీచ్‌లలో సముద్రం ముందుకు వచ్చినా, సూర్యలంక తీరంలో మాత్రం రాలేదు. ఇక్కడ పెద్ద పెద్ద ఇసుకతిన్నెలు ఉండడమే దీనికి కారణం. అయితే గత పదేళ్లలో ఇక్కడున్న ఇసుకతిన్నెలు భారీగా తరిగిపోయాయి. దీనివల్లే భవిష్యత్‌లో మరింత ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సునామీలు, ఉప్పెనలు సంభవిస్తే సముద్రం ముందుకు చొచ్చుకొచ్చే ఆస్కారం ఉందని చెబుతున్నారు.



'పూర్'ఇంటిపై పైశాచికం : తొలగించిన పేదల గుడిసెలు



తీరానికి గుండె కోత : ఇసుక తరలింపుతో కరిగిపోయిన కరకట్ట

ఎస్టీల గుడిసెలు తొలగింపు

కొన్నేళ్లుగా తీరంలో జీవిస్తున్న ఎస్టీల గుడిసెలను బుధవారం అధికారులు తొలగించడంతో ఇక్కడ ఆక్రమణల వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. ఎస్టీలలో కొందరు చేపలవేటతో పొట్టపోసుకుంటుండగా, మరికొందరు తీరంలో ప్లాస్టిక్, చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గుడిసెలు ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించి రిసార్ట్‌లు కట్టాలని ఎవరికి ఆలోచన వచ్చిందో? తెల్లారేసరికి పేదల గుడిసెలు కనుమరుగయ్యాయి. గుడిసెల కూల్చివేత సంగతి తనకు తెలియదని తహసీల్దార్, ఉన్నతాధికారులు చెబుతుంటే గుడిసెలు కూల్చిన వీఆర్వో మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చర్యలు చేపట్టామని చెబుతున్నారు. ఆక్రమణలంటూ పేదల గుడిసెలు తొలగించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వెలసిన ప్రైవేట్ రిసార్ట్‌ల జోలికి వెళ్లకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అధికారుల తీరు ప్రభుత్వానికి తలవంపులు తెస్తోందనేది కొందరు అధికారపార్టీ నేతలమాట.

నిబంధనలు మీరినా.. స్పందించని అధికారులు

తీరంతోపాటు అటవీశాఖ స్థలం నుంచి ఇసుకను తరలిస్తున్నా ఇటు కలెక్టర్, జేసీతోపాటు అటు అటవీశాఖ అధికారులూ స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రెండుశాఖల అధికారులు రియల్టర్లతో లాలూచీ పడటం వల్లే తీరంలో ఇసుక తరలిపోతోందని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. తీరంలో మత్స్యకారులకు ఇచ్చిన స్థలాల్లో అక్రమంగా రిసార్ట్‌లు, హోటళ్లు వెలసినా అధికారులు మిన్నకుండిపోయారు. సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు సూర్యలంక తీరంలో ఎటువంటి ప్రైవేటు రిసార్ట్‌లు, హోటళ్ల నిర్మాణానికి అనుమతిలేదు. కానీ ఇక్కడ యథేచ్ఛగా ప్రైవేటు రిసార్ట్‌లు వెలిశాయి. అధికారులు నెల మామూళ్లతో సరిపెట్టుకుంటుండటం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు ఉన్నాయి.

డ్రాపౌట్ల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

బాపట్ల: జిల్లాలోని పాఠశాలల్లో డ్రాపౌట్ల నియంత్రణకు యుద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రధానాచార్యులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. జూనియర్ కళాశాలల్లోనూ డ్రాపౌట్ల నివారణకు అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పదో తరగతిలోపు 2,676 మంది విద్యార్థులను డ్రాపౌట్లుగా గుర్తించామన్నారు. వీరిందరి వివరాలు స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నిక్షిప్తం చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. బడిఈడు పిల్లలను ఈనెల 14వ తేదీలోగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బల్లికురవ మండలంలో 368 మంది విద్యార్థులు బడి బయట ఉంటే విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఏం చేస్తున్నారని కలెక్టర్ నిలదీశారు. కర్లపాలెం మండలంలో 258 మంది, చీరాలలో 250 మంది, నగరంలో 192 మంది, కొల్లూరులో 177, నిజాంపట్నంలో 172, కారంచేడులో 168, చెరుకుపల్లిలో 154 మంది విద్యార్థులు బడి బయటనే ఉన్నారని, వారిని తక్షణమే పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు.

జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్చాలి

జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. ఇటీవల పదో తరగతి పరీక్షలలో 12,500 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. జిల్లాలోని 113 జూనియర్ కళాశాలలో 6,619 మంది మాత్రమే చేరారన్నారు. మిగిలిన వారంతా ఎక్కడ ఉన్నారో గుర్తించి స్టూడెంట్ ఇన్ఫోలో నిక్షిప్తం చేయాలని సూచించారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన 424 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బాపట్ల మండలంలో 230 మంది విద్యార్థులు పదో తరగతి ఫెయిల్ అయితే 168 మందిని పాఠశాలల్లో చేర్పించారని మిగిలిన వారినీ చేర్పించాలన్నారు. చీరాలలో 323 మంది ఉండగా, వేటపాలెంలో 162, రేపల్లెలో 145, కర్లపాలెంలో 105 మంది విద్యార్థులు ఉండడంపై ఆరాతీశారు. నాడు-నేడు అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



వెదుళ్లపల్లిలో విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్, ఇంటర్మీడియెట్ బోర్డ్ డీఐఓ ఆంజనేయులు, డీఈఓ పీవీ రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలి

ఉన్నత ఉద్యోగ సాధనే లక్ష్యంగా అందరూ కష్టపడి చదవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. తెలిపారు. పదోతరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థులను చేర్పించారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఆ పాఠశాలలో 121 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా 36 మంది ఫెయిల్ కావడంపై కలెక్టర్ ఆరా తీశారు. అధికంగా సైన్స్ సబ్జెక్టులోనే ఫెయిల్ అయినట్టు తేలడంతో ఉపాధ్యాయురాలిని మందలించారు. షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాలలో చేరిన 12 మందిలో 10వ తరగతి ఉత్తీర్ణులయ్యే వారికి రూ.10 వేల చొప్పున బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. తాను చిన్నతనంలో చదువుపై పెట్టిన శ్రద్ధ, సబ్జెక్టులపై పట్టుకోసం కష్టపడిన తీరును విద్యార్థులతో పంచుకున్నారు. కలెక్టర్ వెంట బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డీఈఓ పి.వి.రామారావు, ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మరో అవకాశం

జిల్లా సాంఘిక సంక్షేమ డీడీ రాజ దెబోరా

వేటపాలెం: ప్రభుత్వం పదో తరగతి తప్పిన విద్యార్థులను మళ్లీ స్కూళ్లల్లో చేర్చుకోవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ డీడీ, మండల ప్రత్యేక అధికారి రాజ దెబోరా తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె పరిశీలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ విధానం ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. మళ్లీ స్కూళ్లలో చేరితే రెగ్యులర్ విద్యార్థులకు మాదిరిగానే ప్రభుత్వపరమైన అన్ని సౌకర్యాలు, పథకాలు వర్తిస్తాయన్నారు. టెస్ట్ క్లాస్ ఈసారి పాస్ అయితే రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లు సర్టిఫికెట్ కూడా లభిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం పదిలో తప్పిన ముగ్గురు విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో అడ్మిషన్ చేయించే కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ ఎస్.లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు (ఇన్‌చార్జి) వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు 15లోపు ఈకేవైసీ చేయించాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈనెల 15వతేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడుజిల్లా నరసరావుపేట ట్రెజరీ కార్యాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు 3,238మంది ఉండగా ఇంకా 385మంది ఈకేవైసీ చేయించలేదని తెలిపారు. ఆ 385మంది పెన్షన్‌దారులు వెంటనే ట్రెజరీ కార్యాలయ అధికారులతో సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో సదరు పెన్షన్‌దారులకు పింఛన్ నిలివేయటం జరుగుతుందన్నారు.

మంత్రి నాగార్జునను విమర్శించే అర్హత ఆనందబాబుకు లేదు

టీడీపీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చంద్రబాబు, నక్కా ఆనందబాబు దిష్టిబొమ్మలు దహనం



చంద్రబాబు, నక్కా ఆనందబాబు దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: వేమూరు నియోజక వర్గం అభివృద్ధే పరమావధిగా పనిచేస్తూ ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునను విమర్శించే అర్హత మాజీ మంత్రి నక్కా ఆనంద బాబుకు లేదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. భట్టిప్రోలులో మంగళవారం టీడీపీ నాయకులు నిర్వహించిన పాదయాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి నాగార్జునలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన ఆనందబాబు ఎప్పుడైనా రోజులో కనీసం ప్రజల కోసం రెండు గంటలు కూడా కేటాయించారా అని ప్రశ్నించారు. మంత్రి నాగార్జున భట్టిప్రోలుకు ఏమి చేశారని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా జగనన్న ఊళ్లకు ఊళ్లనే నిర్మిస్తున్నారని తెలిపారు. ధర్మం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పోరాడుతున్న జగనన్నపై ఎన్ని దుష్ట శక్తులు కుయుక్తులు పొందినా చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు, నక్కా ఆనంద్‌బాబుల దిష్టి బొమ్మలను దహనం చేశారు. 'ధర్మం కోసం రాక్షసులతో రాముడు యుద్ధం' అంటూ స్థానిక రథం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోంది

- క్రికెటర్ అంబటి రాయుడు
- ప్రజా సేవ చేసేందుకు జిల్లాలో పర్యటన

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను బాగా ప్రోత్సహిస్తుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. 18వ డివిజన్ ఆర్.అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబా సమేత మల్లేస్వారస్వామి వారి దేవస్థానంలో స్వామి వారిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలోని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం వల్ల మంచి క్రీడాకారులను అందించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆ దిశగా ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సేవ చేయాలనే ఆలోచనతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

వేణుగోపాల్‌నగర్‌లో....

గుంటూరు ఎడ్యుకేషన్: వేణుగోపాల్‌నగర్‌లోని కోనబాల ప్రభాకరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించి విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడి వారిలోని భాషా నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలను వడ్డించారు. విద్యార్థులు ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు.

ఆరని వలంటీర్ల ఆగ్రహ జ్వాల

చీరాలలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం



చీరాల గడియార స్తంభం సెంటర్‌లో పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న వలంటీర్లు

చీరాల: వలంటర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా వలంటీర్లు చేస్తున్న నిరసనలు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నాయి. బుధవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో చీరాల్లోని గ్రామ, వార్డు వలంటీర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వలంటీర్లు మానవహారం చేసి పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి చిత్రపటాన్ని దహనం చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.50 లక్షల వలంటీర్లు నిష్పక్షపాతంగా సేవలందిస్తున్నారన్నారు. రూ.5 వేలు గౌరవ వేతనంతో ప్రజలందరికీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వివిధ రకాల ధ్రువీకరణపత్రాలు అందించడంతో పాటు కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందిన వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. రాజకీయ అజ్ఞాని అయిన పవన్ వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసి మానసిక వేదనలకు గురిచేశాడని, బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనను ఓర్వలేక టీడీపీతో కలిసి ప్రభుత్వంపై బురదజల్లడం మానుకుని పద్ధతిగా రాజకీయాలు చేసుకోవాలన్నారు. కానీ వలంటీర్లను కించపరుస్తూ అవాకులు, చవాకులు మాట్లాడితే పవన్‌కు రాజకీయ మనుగడే లేకుండా పోతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్ బత్తుల అనిల్, నాయకులు యాతం మేరిబాబు, సల్లూరి అనిల్, వాసిమళ్ల వాసు, శ్రీను, అధిక సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.

పశు సేవా రథాల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల: జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా జిల్లా మేనేజర్ అవనిగడ్డ భీష్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత ఉండాలని స్పష్టం చేశారు. ప్యారా వెట్‌కు డిప్లమో ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హతగా పేర్కొన్నారు. 30ఏళ్లలోపు వయస్సు ఉండాలని తెలిపారు. పైలెట్ పోస్టుకు టెన్త్ ఉత్తీర్ణతతో పాటు 35ఏళ్లలోపు వారు అర్హులుగా నిర్ణయించారని తెలిపారు. 2 నుంచి 3 ఏళ్ల అనుభవంతో హెవీడ్రైవింగ్ లైసెన్సు ఉండాలని సూచించారు. మూడు కేటగిరీల్లో 10 చొప్పున 30 పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9505077887 నంబరులో సంప్రదించాలని కోరారు.

కృష్ణా, ప్రకాశం టెస్ట్ మ్యాచ్ ప్రారంభం

సెంచరీతో చెలరేగిన వరుణ్ సాత్విక్



వరుణ్ సాత్విక్ (143 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–19 బాలుర మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌ల్లో భాగంగా బుధవారం కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య ఆట ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 143 పరుగులు సాధించగా, ప్రకాశం బౌలర్ పి.దుర్గా బాలాజీకి రెండు వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమ రావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు. గురువారం రెండవ రోజు ఆట కొనసాగనుంది.

మున్సిపల్ కమిషనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి ఆదిమూలపు సురేష్
- సమస్యలపై వినతిపత్రం సమర్పించిన అసోసియేషన్ నాయకులు



మంత్రి ఆదిమూలపు సురేష్‌ను సత్కరిస్తున్న కమిషనర్, నాయకులు

తాడేపల్లి రూరల్: కమిషనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కమిషనర్ అసోసియేషన్ నాయకులు బుధవారం సచివాలయంలో ఆయన్ను కలసి వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు నాగ నరసింహారావు మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్రంలో 120 మున్సిపాలిటీలు ఉండగా వాటిల్లో 30చోట్ల అనుభవం లేని వారిని వివిధ శాఖల నుంచి తీసుకువచ్చి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతోందని చెప్పారు. మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసే కమిషనర్లు చాలామంది ఉన్నారని, వారిని నియమించాలని కోరారు. వివిధ శాఖల నుంచి వచ్చిన వారు మున్సిపల్ శాఖలో విలీనం కావడానికి ప్రయత్నం చేస్తున్నారని, దాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మంత్రి ఆదిమూలపు సురేష్ సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన్ను సంఘ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలస్వామి (రుడా వైస్ చైర్మన్), కోశాధికారి బి.శివారెడ్డి (ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్), ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి 31లోగా దరఖాస్తులు

తెనాలి: జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో ఆగస్టు–2023 విద్యాసంవత్సరం రెండో విడత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్/కన్వీనర్ రావి చిన్నవెంకటేశ్వర్లు కోరారు. తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ, జిల్లా స్థాయి శిక్షణా కేంద్రం/ప్రభుత్వ ఐటీఐ–గుంటూరులో ఏర్పాటుచేసిన నమోదు కేంద్రానికి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఆగస్టు 4వ తేదీ నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆగస్టు 4, 9 తేదీల్లో ఉదయం 9 గంటలకు, అన్ని ప్రైవేటు ఐటీఐల్లో ఆగస్టు 5,6,7 తేదీల్లో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. సందేహాలుంటే 9347795839, 9014491772 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీజీహెచ్‌లో 24 గంటల ల్యాబ్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బుధవారం 24 గంటల ల్యాబ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ప్రారంభించారు. ప్రైవేటు సంస్థతో ఒప్పందం చేసుకుని రోగులకు 24 గంటలూ వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలనే లక్ష్యంతో ఆసుపత్రిలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రితో ఒప్పందం చేసుకున్న ప్రైవేటు ల్యాబ్ వారు బ్లడ్ శాంపిల్స్ తీసి బయట ల్యాబ్ రిపోర్టులు తెచ్చేవారన్నారు. కొంత మంది ప్రైవేటు ల్యాబ్ వ్యక్తులు సైతం ఈవిధంగా జీజీహెచ్‌కు వచ్చి శాంపిల్స్ తీసుకు వెళుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బయట వ్యక్తులు జీజీహెచ్‌కు వచ్చి అనుమతి లేకుండా బ్లడ్ శాంపిల్స్ తీసుకెళ్లే విధానాన్ని కట్టడి చేసేందుకు రోగులకు 24 గంటలూ వైద్య పరీక్షలు చేసేందుకు వీలుగా ల్యాబ్ పనిచేస్తోందన్నారు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా జీజీహెచ్‌లోకి వచ్చి శాంపిల్స్ తీసుకెళితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస్ ప్రసాద్, గ్లోబల్ ల్యాబ్ నిర్వాహకులు వెంకట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రెండు స్కూల్ బస్సులు ఢీ

ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు



ఎదురెదురుగా ఢీకొనటంతో ఒక బస్సు ముందు అద్దాలు పగిలిన దృశ్యం

దాచేపల్లి: రెండు ప్రైవేట్ స్కూల్ బస్సులు ఢీకొన్న సంఘటన బుధవారం జరిగింది. మండలంలోని గామాలపాడు సమీపంలో జరిగిన ఈ ఘటనలో రెండు ప్రైవేట్ స్కూల్ బస్సులు ఢీకొనటంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. దాచేపల్లిలోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్ బస్సు విద్యార్థులతో గామాలపాడు నుంచి దాచేపల్లికి వస్తుంది. దాచేపల్లిలోని ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన మరో బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు గామాలపాడుకు చేరుకుంది. విద్యార్థులతో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బస్సు మలుపు వద్ద స్పీడ్‌గా వెళ్తూ సడన్‌గా ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఆక్స్‌ఫర్డ్ స్కూల్ బస్సు ముందు ఉన్న బస్సును ఢీకొట్టింది. శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన బస్సులో ఉన్న విద్యార్థుల్లో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి.

సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని విశ్వేశ్వరం గ్రామంలో రూ.2.36కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవన సముదాయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం బాగోక చికిత్సలు పొందలేని పేదలకు వైద్యానికై ఆరోగ్యశ్రీ పథకాన్ని నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టారని, ఆయన బాటలోనే ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అభివృద్ధి పేదలకు మరింత చేరువచేశారన్నారు. రూ.1000 దాటి చికిత్సలు చేయించుకునే అనేక వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా పథకాన్ని విస్తరింపజేశారన్నారు. ఏపీ తెలంగాణలో కాకుండా పక్క రాష్ట్రాలలోని కార్పొరేట్ వైద్యశాలలో సైతం ఆరోగ్యశ్రీ వైద్యంపొందేలా చర్యలు తీసుకున్నారన్నారు. 104, 108 వాహనాలను అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతినిత్యం వైద్యసేవలు అందేలా ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్‌లు ఇంటింటికి పర్యటించి ప్రజలకు కావాల్సిన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొరగా పనిచేసిన నేపథ్యంలో ప్రాథమిక చికిత్సకు సైతం పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. నేడు ఆ విధానానికి స్వస్తి పలికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా ఇరువురు వైద్యులను వైద్యశాలలో నియమించారన్నారు. ప్రజారోగ్యానికి నిరంతరం శ్రమించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి విజయమ్మ, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ కె.శివనాగ మల్లేశ్వరరావు, ఎంపీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రతకే 'సాగర్‌కవచ్'



మెరైన్ స్టేషన్ల పోలీసులకు సూచనలు, సలహాలు ఇస్తున్న డీఎస్పీలు

బాపట్లటౌన్: తీరప్రాంత భద్రతే సాగర్ కవచ్ ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. తీరప్రాంతాన్ని పరిరక్షించడంలో భాగంగా తీరంలో రెండురోజులపాటు సాగర్ కవచ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. మెరైన్, కోస్ట్‌గార్డు, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని సముద్ర తీర భద్రతను పరీక్షించడానికి, ఉగ్రదాడి జరిగినప్పుడు పోలీసుల సంసిద్ధతను అంచనా వేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తీరప్రాంతంలోనికి ఉగ్రవాద కదలికలకు సంబంధించిన సమాచారం సేకరించడానికి, చొరబాటుదారులను అడ్డుకోవడానికి, ఏదైనా విధ్వంసక పదార్థాలను గుర్తించడానికి, చొరబాటుదారులను విచారించడానికి పోలీస్ బృందాలను పలు ప్రాంతాల్లో నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో పటిష్ట బందబస్తును నిర్వహిస్తూ, వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఉగ్రవాదులుగా వ్యవహరించే 'రెడ్ టీం' జిల్లా తీరప్రాంతంలో చొరబడడానికి ప్రయత్నిస్తే సమర్థవంతంగా అడ్డుకోవాలన్నారు. రైల్వేస్టేషన్‌లలో, బస్టాండ్ లలో ముఖ్యమైన ప్రదేశాల్లో వాహనాలను తనిఖీ చేయాలన్నారు.

వాడరేవులో ...

చీరాల: సముద్ర తీరం నుంచి ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు జనసంచారంలోకి వచ్చి విధ్వంసాలు చేయకుండా ఉండేందుకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో బుధవారం రూరల్ ఎస్ఐ జనార్దన్ ఆధ్వర్యంలో వాడరేవులో సాగర్ కవచ్ చేపట్టారు. తీరప్రాంతానికి వచ్చే వాహనాలను క్షుణంగా తనిఖీ చేయడంతో పాటుగా అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు. వాడరేవు లైట్ హౌస్ నుంచి తీరానికి వస్తున్న బోట్లు, మరపడవల జాడలను పరిశీలించారు. అలానే పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, పలు లాడ్జిలను తనిఖీలు చేశారు. తీర ప్రాంత రక్షణలో భాగంగా సాగర్ కవచ్ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా అనుమానిత వస్తువులు, వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించి రక్షణలో పాలు పంచుకోవాలన్నారు. తనిఖీల్లో ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శేష భానురావుకు ఘన నివాళి

తెనాలి: గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పిన్నక శేషభానురావు (52) అంతిమయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం ఆయన అక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతిక కాయాన్ని బుధవారం తెల్లవారుజామున తెనాలి కొత్తపేటలోని సరోజిని నాయుడు వీధిలోని నివాసానికి తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విచ్చేసి శేషభానురావు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) ఉదయాన్నే వచ్చి శేషభాను రావుకు నివాళి అర్పించారు. సహకార రంగంలో ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, బ్యాంకు బ్రాంచిల మేనేజర్లు, యూనియన్ నాయకులు శేషభాను రావుకు నివాళులర్పించారు.

15లోగా ప్రతిపాదనలు పంపాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 15వ తేదీలోపు ఎంఈవో, డీవైఈవోల ద్వారా ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో httpr://nationaawardsotŠreacherreducation.gov.in సైట్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు.